
మహేశ్వర భట్
శ్రీకృష్ణ

Copyright © 2019, Srikrishna
All rights reserved.

No part of this publication may be reproduced or transmitted in any form or by any means, electronic or mechanical, including photocopy, recording or any information storage and retrieval system now known or to be invented, without permission in writing from the publisher, except by a reviewer who wishes to quote brief passages in connection with a review written for inclusion in a magazine, newspaper or broadcast.

Published in India by Prowess Publishing,
YRK Towers, Thadikara Swamy Koil St, Alandur,
Chennai, Tamil Nadu 600016

ISBN: XXX-XX-XXXXXX-X-X

Library of Congress Cataloging in Publication



ఆకాశం భయంకరమైన ఉరుములు, మెరుపులతో నిండిపోయి ఉంది. మెరుపు వచ్చినపుడు దట్టమైన నల్లటి మేఘాలు ఒక్కసారిగా రెప్పపాటు క్షణం పాటు తెల్లవిగా కనబడుతున్నాయి. మెరుపులు లేనప్పుడు ఆ క్షణంలోనే అవి భయంకరమైన నల్లగా, దట్టంగా అలుముకున్న మేఘాలుగా తమ నిజరూపాన్ని చూపిస్తున్నాయి.

కాసేపటికి ఆ ఉరుములు, మెరుపులులకు తోడుగా అక్కడ చిన్నగా వర్షం కూడా మొదలు అయింది. అలా చిన్నగా మొదలైన ఆ వర్షానికి తడిసిన ఆ యోధుడి చేతిలో ఉన్న కత్తికి అంతకు ముందే చేసిన యుద్ధంలో అంటిన రక్తపు మరకలు పడుతున్న వర్షపు చినుకుల వలన తొలగిపోతున్నాయి. అతడు అలాగే వర్షంలో తడుస్తూ కళ్లను తిప్పుతూ ఆ కొండ కింద వైపు చూసాడు. ఆ కొండ కింద నుండి కొంతమంది శత్రువులు ఆయుధాలతో దాడి చేయడానికి అతడి వైపు వస్తున్నారు. అతడు తల కాస్త పక్కకు తిప్పి అతడి వెనుక ఉన్న కొండ గుహలో బాగా గాయపడి ఆ నొప్పులతో బాధపడుతూ ఉన్న అతడి మహారాజు వర్షంలో అస్పష్టంగా కనబడ్డాడు. ఇప్పుడు అతడి మనసులో ఒకటే ఆలోచన ఎలాగైనా సరే తన ప్రాణాలకు తెగించి అయిన శత్రువుల నుండి తన మహారాజును కాపాడుకోవాలి. కానీ ఒంటరిగా ఉన్న అతడు వస్తున్న అనేక మంది శత్రువులను ఎదుర్కొని పోరాడగలనా అని మనసులో ఒకచిన్న అనుమానం.

అయినా సరే తన మహారాజును కాపాడుకోవడానికి ధైర్యం చేయాలి అనుకుని రెండు చేతులు అలా చాచి మెరుస్తూ ఉన్న ఆకాశం వంక అలా చూసి ఒక్కక్షణం కళ్ళు మూసుకుని “శ్రీకృష్ణా” అని గట్టిగా అరిచాడు. వెంటనే ఎక్కడో పిడుగు పడినట్టు శబ్దం వినపడింది. దానికి అతడు భయపడకుండా అలాగే నిలబడి,

“మహారాజును కాపాడుకోవాలి అనేది ఇప్పుడు నా కర్తవ్యం. ఈ కర్తవ్యం నాది దీని కోసం చేసే కర్మ నీది” అంటూ శ్రీకృష్ణుడికి తన కర్మను అంకితం చేసి వస్తున్న శత్రువులను ఎదుర్కోవడానికి తన కుడిచేతిలో ఉన్న కత్తిని మరింత బిగించి పట్టుకుని ప్రతిదాడి చేసేందుకు సిద్ధం అయ్యాడు........!

“పిల్లలు బస్సు బయలుదేరింది.అందరూ రండి వెళదాం.” అంటూ తమ టీచర్ పిలవడంతో అప్పటివరకు ఆ గైడ్ చెబుతున్న కథలో లీనమై వింటున్న

పిల్లలందరూ ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చి లేచి బస్ వైపు పరుగెత్తే హడావిడిలో పడిపోయారు.

అది చూసి ఆ గైడ్ ఆ టీచర్ వైపు చిరాకుగా చూసాడు. ఆమె మాత్రం పిల్లలను జాగ్రత్తగా బస్ ఎక్కించే పనిలో బిజీగా ఉంది.

ఆ గైడ్ దగ్గరకు మరొకడు వచ్చి

"క్యా... భాయ్? అలా ఉన్నావు ఎందుకు ?"అని అడిగాడు.

దానికి ఆ గైడ్ "కుచ్ నహి భాయ్ అందరూ టూర్ కు వస్తారు. చూస్తారు. వెళ్లి పోతారు. అంతేకాని అరె..దాని చరిత్ర ఏమి? అని పూర్తిగా తెలుసుకుందాం అని ఒక్కరూ ప్రయత్నం చేయరే..! మరొక్క పది నిమిషాలు ఉండుంటే కనీసం ఈ పిల్లలు అయినా నేను చెప్పే కథ పూర్తిగా వినేవారు. ఇంతలో అదిగో ఆ టీచర్ వచ్చి పిల్లలందరిని తీసుకెళ్లి పోయింది. నేను ఇక్కడ గైడ్ గా జీవితం మొదలు పెట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఈ కథ పూర్తిగా చెప్పలేక పోయాను తెలుసా.!" అని అతడికి చెప్పడంతో.

"నీ డబ్బు నీకు వచ్చింది కదా బాయ్. చోడ్ దో, ఇక వారు నీ కథ వింటే ఏమిటి? వినక పోతే ఏమిటి? నువ్వు చెప్పే కథను కూడా వినడానికి ఎవడో ఒకడు వస్తాడులే"అని ఆ వ్యక్తి గైడ్ తో అనడంతో,

"హూ..మ్.మ్ చూద్దాం..! వాడు ఎవడో?" అంటుండగా ఆ ఆలయం దగ్గరకు మరొక బస్ రావడంతో ఆ గైడ్ పరుగెత్తుకుంటూ వెళ్ళి వారిని తన వైపు తిప్పుకునే పనిలో బిజీగా అయిపోయాడు.

*******

టక్..టక్...టక్...టక్. మని

ఎవరో తలుపు కొడుతున్న చప్పుడు రావడంతో తలుపు తీయగానే ఎదురుగా రామకృష్ణ కనబడడంతో జగదీష్ అతడిని కౌగలించుకొని "ఎప్పుడు వచ్చావు? బావా" అని అడిగాడు.

"ఇప్పుడే వచ్చాను. నా లగేజ్ బ్యాగ్ మా ఇంట్లో పడేసి మిమ్మల్ని ఒకసారి చూసి వెళ్దాం అని ఇలా వచ్చాను" అని రామకృష్ణ అంటూ ఇద్దరూ లోపలికి వచ్చి సోఫాలో కుర్చున్నారు.

ఇంతలో తన గది నుండి స్నేహ బయటకు రావడంతో రామకృష్ణ "హాయ్ స్నేహా" అన్నాడు.

దానికి ఆమె ఒక్కక్షణం ఆగి రామకృష్ణను అలా సూటిగా చూసి మళ్ళీ చూపు తిప్పుకొని అతడిని పట్టించుకోకుండా తన పని తాను చూసుకుని తన గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

అది చూసి రామకృష్ణ తల చిన్నగా అడ్డంగా ఊపి తాను ఇంకా మారలేదు అనుకొని జగదీష్ తో అదీ ఇదీ మాట్లాడి తన ఇంటికి వెళ్ళి పోయాడు.

ఆ రోజు సాయంత్రం రామకృష్ణ తన ఇంట్లో ఏదో పుస్తకం చదువుతూ ఉండగా జగదీష్ వచ్చి "బావా భోజనానికి నిన్ను రమ్మని అమ్మ చెప్పింది" అని అన్నాడు.

"ఆ... కాసేపు తరవాత వస్తాను"అని రామకృష్ణ అన్నాడు.

"సరే కానీ బావా.! హెచ్చమనాయక, శివుడు కథల తర్వాత చాలా గ్యాప్ తీసుకుంటున్నావు నాకు మరొక కథ చెప్పడానికి ఏంటి విషయం?"అని జగదీష్ అడగడంతో రామకృష్ణ కాస్త నవ్వి

"సమయం రావాలి. సోర్స్ దొరకాలి కదా మంచి కథ చెప్పడానికి. అయినా నీకు ఈ సారి హెచ్చమనాయక ను మించిన కథ దొరికితేనే చెప్పాలి అనుకున్నాను. అందుకే కాస్త ఆలస్యం అవుతోంది. చూద్దాం. దగ్గరలో ఏవైనా మంచి కథలు దొరుకుతాయేమో"అని చెప్పాడు.

"నువ్వు చెప్పే మంచికథ కోసం ఇక్కడ వెయిటింగ్ బావా."

రామకృష్ణ నవ్వి"సరే చూద్దాం లే. రేపు టూర్ వెళ్లాలి అనుకుంటున్నాను. అక్కడ ఏవైనా ఆధారాలు దొరికితే నీకు ఒక మంచి కథ చెప్తాలే."అనడంతో

"సరే బావా తొందరగా వచ్చేయ్ భోజనం చేద్దాం"అని చెప్పి జగదీష్ వెళ్లి పోయాడు.

రామకృష్ణ ఆ పుస్తకం పక్కన పెట్టి జగదీష్ వాళ్ళ ఇంటికి వెళ్ళేసరికి అందరూ భోజనం చేయడానికి డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చున్నారు. రామకృష్ణ కూడా వెళ్లి అక్కడ కుర్చుని అన్నం కలుపుకుని తింటూ స్నేహ తనవైపు చూస్తుందేమో అని తన వైపు ఓరగా చూసాడు. ఆమె తింటూ ఉంది కానీ

అతడి వైపు కనీసం చూడను కూడా లేదు. ఇక ప్రయోజనం లేదు అనుకుని రామకృష్ణ పల్లెంలో అన్నం పెట్టుకుని తింటుండగా, "బావా కడప జిల్లాలో మీ పురాతత్వ శాఖ వారు ఏదో పల్లెలో తవ్వకాలు జరుపుతున్నారు అన్నావు కదా ఇప్పుడు ఎలా సాగుతోంది?"అని జగదీష్ అడిగాడు.

"అక్కడ ఒక గుడిని పూర్తిగా మట్టి నుండి బయటకు తీయించాము. ఇప్పుడు అక్కడ గ్రామస్తులు పూజలు కూడా చేస్తున్నారు. ఆ గ్రామస్థులు చెప్పిన దాని ప్రకారం అక్కడ ఇంకా నూట ఆరు ఆలయాలతో పాటు ఒక బంగారు రథం కూడా ఆ ప్రాంతంలోనే ఎక్కడో ఉన్నాయి అని తెలిసింది. కానీ వాటికి సంబంధించిన చారిత్రక ఆధారాలు ఏవీ మాకు దొరకలేదు. పరిశోధన ఇంకా కొనసాగుతూనే ఉంది. అది కొన్ని రోజులలో ఒక కొలిక్కి వస్తుంది. ఆ తరువాత నన్ను మళ్ళీ వైజాగ్ కి పంపించేస్తారు. నాకు సంవత్సరానికి పది రోజులు శెలవు తీసుకుని అలా టూర్ కి వెళ్లి రావడం అలవాటు. అందుకే ఈసారి అలా ఝాన్సీ, ఫతేపూర్, కాశీ వరకు వెళ్లొద్దాము అనుకుంటున్నాము. వీలయితే నువ్వు రా జగదీష్ అలా వెళ్లొద్దాము"అని రామకృష్ణ అనడంతో,

"నాకు కూడా సంక్రాంతి శెలవులు వచ్చాయి. బావా వస్తాలే" అని ఉత్సాహంగా అన్నాడు జగదీష్.

"ఈ సారి నేను వస్తాను" అన్నది స్నేహ.

దెబ్బకి రామకృష్ణ, జగదీష్ ఇద్దరూ కళ్ళు పెద్దవి చేసి ఆమె వైపు చూసారు. రామకృష్ణ అయితే మరీనూ తనతో మాట్లాడటానికి కూడా ఇష్టం లేని ఈ అమ్మాయి నాతో టూర్ కి వస్తాను అంటోంది ఏమిటి అని.

"అయినా అంతదూరం నువ్వెందుకే?" అని మంగమ్మ వారించినా

"ఎప్పుడూ వాడేనా? ఈసారి నేను వెళ్తాను"అని మారాం చేసింది స్నేహ.

అసలు రాదు అనుకున్న స్నేహ టూర్ కి వస్తాను అని ఎందుకు అలా మారాం చేస్తుందో రామకృష్ణకు అసలు అర్థం కాలేదు. ఈ అమ్మాయిలు అంతే ఎవరికి అర్థం కారు.

"అంతదూరం నీతో టూర్ వెళ్లడం పాపం రామకృష్ణ కు ఇబ్బందేమో?"అని మంగమ్మ కాస్త అనుమాన పడింది.

“అయ్యో..అలా ఏమీ లేదు అత్తా. మామూలుగా నేను ఒక్కడినే అయితే రైలు దొరికితే రైలు, బస్ దొరికితే బస్ అంటూ ప్లాన్ లేకుండా అడ్డదిడ్డంగా వెళ్లేవాణ్ణి. అదే వీళ్ళు నాతో ఉంటే ఒక ఆర్గనైజింగ్ గా ప్లాన్ వేసుకుని వెళ్తాను. స్నేహ రావడం వలన నాకు ఎలాంటి ఇబ్బందీ లేదు” కృష్ణ అనడంతో,

“మా అమ్మకు మీ రెకమండేషన్ ఏమి అవసరం లేదు” స్నేహ కాస్త కటువుగా అన్నది.

ఏమైతే ఏమి స్నేహ ను కూడా జగదీష్, రామకృష్ణ లతో పంపడానికి ఆమె అమ్మ నాన్న ఒప్పుకోవడంతో ముగ్గురు సంతోషంగా బయలుదేరారు. అలా వారు ఝాన్సి కి వెళుతుండగా మధ్యప్రదేశ్ లో ఒకచోట ఏదో బ్రిడ్జి దెబ్బ తిన్నది అని బస్ డ్రైవర్ హైవే నుండి ఒక అడవి మార్గంలో బస్ దారి మళ్లించి వెళ్లాడు. అలా చాలా దూరం వెళ్లిన తరువాత ఆ బస్ ని ఆపి డ్రైవర్ ఏదో సమస్య ఉంది అని కిందకి దిగి చూసాడు. బస్సుకు ముందరి చక్రం పంక్చర్ అవడంతోను స్టెప్నీ టైర్ లేకపోవడంతో డ్రైవర్ అందరినీ కిందకి దిగమని చెప్పాడు.దాంతో అందరు చిరాకుగా కిందకి దిగారు. అదృష్టం కొద్దీ కాస్త దూరంలో ఒక హోటల్ వారికి కనబడింది. అక్కడకు వెళ్లి దగ్గరలో ఏదైనా పంక్చర్ షాప్ ఉందా అని డ్రైవర్ అడగడంతో ముప్పై కిలోమీటర్ల వరకు అటువంటివి ఏవి లేవు ఒకగంట తర్వాత ఈ దారి గుండా ఒక ప్రైవేటు బస్ వస్తుంది చక్రాన్ని ఆ బస్సులో తీసుకుని వెళ్లి రిపేర్ చేయించవచ్చు అని చెప్పాడు.

దాంతో ప్రయాణికులు అందరు మొదట కాస్త చిరాకు పడినా అక్కడ ఉన్న అడవి అందాలను ఆస్వాదిస్తూ కాస్త స్థిమితపడ్డారు.

ఆ చిన్న హోటల్ కి భోజనం చేయడానికి అని స్నేహ, జగదీష్, రామకృష్ణ ముగ్గురు వెళ్లారు. అక్కడ తిన్న తరువాత పక్కన ఉన్న ఐస్క్రీం కొనుక్కోవడానికి జగదీష్ అలా వెళ్లాడు.

స్నేహతో మాట్లాడడానికి దొరికిన కాస్త అవకాశాన్ని రామకృష్ణ విడవకూడదు అనుకొని “స్నేహా ఇంతకు ముందు సారి వచ్చినపుడు నీకు చెప్పిన దాని గురించి ఏమి ఆలోచించావు?” అని అడిగాడు.

దానికి స్నేహ “అప్పుడే చెప్పాను కదా నాకు టైం కావాలి” అని చెప్పింది.

“నీకు అవసరం అయినంత టైం తీసుకోమని నేను అప్పుడే చెప్పాను కదా.

ఇష్టం ఉంటే సరే అని చెప్పు లేదంటే నచ్చలేదు అని చెప్పు పర్వాలేదు కానీ నాతో మాట్లాడకుండా ఇగ్నోర్ చేయకు ప్లీజ్ "అని రామకృష్ణ కాస్త బాధగా అనేసరికి,

"నేను నిన్ను ఎప్పుడు ఇగ్నోర్ చేసాను?" అని స్నేహ ఇంకా ఏదో మాట్లాడబోతుండగా జగదీష్ మూడు కోన్ ఐస్క్రీం చేతిలో పట్టుకొని అక్కడికి వచ్చేసరికి ఇద్దరూ ఒకసారిగా మామూలుగా అయిపోయారు.

జగదీష్ తన చేతిలోని ఐస్క్రీం అందిస్తూ "ఏమి బావా ఇది ఇష్టమే కదా.!" అని అడిగాడు.

దానికి రామకృష్ణ నా బాధ నాది, వీడి బాధ వీడిది అని మనసులో అనుకొని ఐస్ క్రీం తిని కౌంటర్ లో బిల్లు కట్టి అలా బయటకు వచ్చారు.

పదిహేను నిమిషాలు అలా టైం పాస్ చేసారు. ఇంకా రెండు, మూడు గంటల సమయం పట్టేలా ఉంది ఆ బస్ రెడి అవ్వడానికి అంత సమయం ఎలా గడపాలా అని ఆలోచిస్తున్న రామకృష్ణకు హోటల్ కు కాస్త దూరంగా ఒక పాతకాలం నాటి ఆలయ గోపురం కనిపించే సరికి దానిని చూద్దామని అతడు అటువైపు వెళ్లగా అతడి వెనుకనే స్నేహ, జగదీష్ కూడా వెళ్లారు.

ఆ గుడిలోకి వచ్చిన ఆ ముగ్గురిని చూసి గైడ్ వారి దగ్గరకు వెళ్దామనుకొని చూస్తే కుర్రాళ్ళు లాగా ఉన్నారు. పైగా అమ్మాయిని వెంటబెట్టుకొని వచ్చారు. ఇక ఈ గుడి గురించి తెలుసుకునే ఓపిక వాళ్లకు ఎక్కడ ఉంటుంది. అనుకోని మళ్లీ తను కుర్చున్న చోటుకి వెళ్లి కుర్చున్నాడు.

ఆ గుడిని అంతా తిరిగి చూసి జగదీష్ ఆనందంతో "బావా ఈ శ్రీకృష్ణుడి ఆలయం చాలా బాగుంది కదా" అని అడిగాడు.

"అవును జగదీష్ ఈ ఆలయం చాలా బాగుంది. నేను కూడా ఇంతకు ముందు ఎప్పుడూ ఈ ఆలయం చూడలేదు. చూడడానికి చాలా పాత ఆలయంలా ఉంది. ఈ ఆలయం గురించి తెలుసుకోవాలి" అని ఉంది అని రామకృష్ణ అనగానే,

"అదిగో అక్కడ కుర్చుని ఉన్నవాడు గైడ్ లాగా ఉన్నాడు. వాడిని అడుగుదాం పదా బావా" అని జగదీష్ రామకృష్ణను చెట్టుకింద రాతి అరుగు మీద కూర్చుని ఉన్న గైడ్ వైపు తోసుకుని వెళ్లాడు.

తన దగ్గరకు వచ్చిన ఆ ముగ్గురిని చూసి ఆ గైడ్ లేచి నిలబడి "ఏమి కావాలి సార్?" అని హిందీలో అడిగాడు.

దానికి రామకృష్ణ "ఈ ఆలయం గురించి తెలుసుకోవాలి అనుకుంటున్నాను. దీనిని ఎవరు కట్టించారు? ఎప్పుడు కట్టించారో చెప్పగలవా?" అని హిందీలోనే అడిగాడు.

దానితో "తప్పకుండా చెపుతాను సార్" అని గైడ్ ఉత్సాహంగా అన్నాడు.

అతడు ఏదో హిందీలో మాట్లాడడం చూసి జగదీష్ కాస్త గట్టిగా "ఆపండి"అని అరవడంతో గైడ్ చెప్పడం ఆపేశాడు.

"అక్కా... ఇక్కడ వీళ్ళు మాట్లాడుతున్నది నీకు ఏమైనా అర్థం అయిందా?" అని జగదీష్ స్నేహను అడిగాడు.

దానికి స్నేహా పెదవి విరిచి తల అడ్డంగా ఆడించింది.

అది చూసి ఆ గైడ్ "ఓ మీరు తెలుగు వారా? అయితే మీకు అర్థం అయ్యేలా అంతా తెలుగులోనే చెబుతాను" అనడంతో

కాస్త షాక్ అయిన జగదీష్ "నీకు తెలుగు వచ్చా?" అని అడిగాడు.

దానికి ఆ గైడ్ "అవునండీ.. ఇక్కడకు తెలంగాణ నుండి ఎక్కువమంది వస్తుంటారు. వారికోసం తెలుగు నేర్చుకున్నాను"అని చెప్పాడు.

దానికి జగదీష్ చిన్నగా చప్పట్లు కొట్టి "శభాష్ అయితే ఇక మాకు అర్థం అయ్యేలా తెలుగులో చెప్పు"అని అడిగాడు.

అప్పుడు రామకృష్ణ కలుగజేసుకుని "అన్నట్టు ఒక విషయం నువ్వు చెప్పబోయే దానిలో ఏదైనా సెంటిమెంట్ సీన్స్ ఉంటే మా జగదీష్ ఏడుస్తాడు. మా వాడు కాస్త సెన్సిటివ్. ఇంతకు ముందు ఒకసారి కథ పూర్తి అయ్యేసరికి ఏడుస్తూ ఉన్నాడు"అని జగదీష్ ను ఆట పట్టించడానికి అనడంతో, అది విని జగదీష్ కాస్త అలిగి నట్టు ముఖం పెట్టాడు.

అప్పుడు ఆ గైడ్ "అలాంటిది ఏమీ లేదు సార్.. ఈ గుడిని కట్టించింది ఒక విదూషకుడు. నిజానికి అతడి కథ జీవితంలో చిరునవ్వు, సంతోషం యొక్క ఇంపార్టెంటెన్స్ ని చెబుతుంది" అని చెప్పాడు.

అది విని జగదీష్ రామకృష్ణ చెవిలో “బావ.. విదూషకుడు అంటే?”అని అడిగాడు.

“విదూషకుడు అంటే జోకర్. మహారాజును నవ్వించడమే అతడి పని”అని రామకృష్ణ చెప్పింది విని జగదీష్

“అవునా? అయితే తొందరగా అతడి గురించి చెప్పండి” అంటూ మరింత ఆసక్తిగా అతడు చెప్పేది వినడానికి జగదీష్ సిద్ధం అయ్యాడు.

అందువల్ల ఆ గైడ్ ఆలయం కట్టించిన విదూషకుడు గురించి చెప్పడం ప్రారంభించాడు.

******

అవి తైమురిద్ అనే పారశీక దేశ వంశం వారు ఆగ్రాను రాజధానిగా చేసుకుని ఉత్తర భారతదేశంలో తమ పరిపాలనను సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న రోజులు.

అలాంటి రోజుల్లో ఒకరోజు ఒక సామాన్య మైన వ్యక్తి రాజమందిరంలోని ప్రవేశించడానికి మహాద్వారం వద్దకు రాగానే అక్కడ ఉన్న ద్వారపాలకుడు ఒకడు అతడిని అడ్డుకుని “ఎవరు నువ్వు? ఇక్కడకు ఎందుకు వచ్చావు?”అని అడిగాడు.

దానికి ఆ వ్యక్తి “నేను మహారాజు గారిని కలవాలి” అని చెప్పాడు.

“ఆయనను కలిసేందుకు అనుమతి పత్రం ఉందా?”అని ద్వారపాలకుడు మళ్ళీ అడిగాడు.

ఆ మాటకు ఆ వ్యక్తి ఒక్కక్షణం ఆలోచించి “అలాంటిది ఏమీ లేదు” అని చెప్పేసరికి,

“అనుమతి లేకపోతే లోపలికి పంపడం కుదరదు” అని ఆ ద్వారపాలకులు కర్కశంగా అన్నాడు.

ఆ వ్యక్తి మాత్రం అమాయకంగా “అయితే ముందు అనుమతి తెచ్చుకోవడానికి వెళ్తాను నన్ను పంపించండి” అని అడిగాడు.

**You’ve Just Finished your Free Sample**

**Enjoyed the preview?**

**Buy: https://store.prowesspub.com**